సాక్షి మెదక్

బుధవారం । 14 । మే । 2025




శ్రమ నాలుగేళ్లు..

ఆయిల్‌పామ్ సాగుపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దిగుబడి, ఆదాయాలపై వివరిస్తున్నారు. వివరాలు 8లో ▸



దుబ్బాక దవాఖాన టాప్

వైద్య సేవలు అందించడంలో దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. వివరాలు 8లో ▸



అభివృద్ధికి దారేది?

నార్సింగి మండల కేంద్రమైనా అభివృద్ధి కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 9లో ▸

ఇసుకాసురుల తిరకాసు దందా!



యూసుఫ్‌పేట వద్ద గాడిదలపై ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

మంజీర నదిలో ఇసుక రవాణాపై నిషేధం

- అక్రమార్కుల కొత్త ఎత్తుగడ
- గాడిదలపై ఇసుక రవాణా
- 55 గాడిదల ఇసుకకు రూ.3,500

పాపన్నపేట(మెదక్): ఓ ఐడియా మీ జీవితాన్నే మార్చేస్తుందని అప్పట్లో ఓ ప్రైవేట్ సంస్థ చేసిన ప్రకటన చర్చనీయాంశమైంది. అలాంటి ఐడియా అక్రమార్కులకు వస్తే.. జేబులు నిండా కాసులే. ఇసుక అక్రమ రవాణాపై నిషేధం ఉండడంతో ఇదిగో అక్రమార్కులకు ఒక కొత్త ఆలోచన తట్టింది. అదేమిటంటే.. మంజీర నదిలో ఇసుక రవాణాపై నిషేధం ఉంది. పాపన్నపేట మండలం యూసుఫ్‌పేట, రేగోడ్ మండలం సింధోల్ పరిసర ప్రాంతాల్లో గాడిదలను ఎక్కువగా పెంచుతుంటారు. యూసుఫ్‌పేటకు ఎనిమిది కుటుంబాలు వలస వచ్చాయి. మొత్తం 40 మంది ఉన్నారు. ఒక్కో కుటుంబానికి 55 గాడిదలు ఉన్నాయి.. ఒక్కో కుటుంబం రోజుకు మూడు ట్రిప్పుల ఇసుక రవాణా చేస్తాయి. అంటే 24 ట్రాక్టర్లు అన్నమాట. నది నుంచి ఒడ్డుకు ఇసుక రవాణా చేస్తే (55 గాడిదలకు కలిపి) ఒక్కో ట్రిప్‌కు రూ.1400 ఇస్తారు. గ్రామంలోనికి రవాణా చేస్తే 55 గాడిదలకు రూ.3,500 చెల్లిస్తారు. ఒక వేళ ట్రాక్టర్ యజమానులు నది ఒడ్డు నుంచి గ్రామం లోనికి రవాణా చేస్తే, గాడిదల యజమానులకు రూ.1900 ఇస్తారు. రూ.900 ట్రాక్టర్ కిరాయి రూ.300 మామూళ్లు తీసుకుంటారు. పాపన్నపేట మండలం చుట్టూర మంజీర నది ఉండటంతో ఏటా ఇక్కడి వ్యాపారులు వారికి అడ్వాన్సుగా డబ్బులిచ్చి గాడిదలను పిలిపించుకుంటారు. లారీలు, ట్రాక్టర్లపై ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదయ్యే అవకాశం ఉండటంతో వీటిపై ఇసుక రవాణా చేస్తున్నారు. 55 గాడిదలు సుమారు ట్రాక్టర్ ఇసుకను రవాణా చేయగలవు. ఒక వేళ నది నుంచి ఇసుక తీసి ఒడ్డున పోస్తే రూ.1,950, ఇంటి వరకు ఇసుక రవాణ చేస్తే రూ.3,500 తీసుకుంటున్నారు. గతంలో కొడుపాక, గాజులగూడెంలలో కూడా గాడిదలపై ఇసుక రవాణా కొనసాగించేవారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు కేంద్రంలో విచారణ



కొనుగోలు కేంద్రంలో విచారణ జరుపుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

పాపన్నపేట(మెదక్): 'ధాన్యం కొనుగోలులో 50 బస్తాలు గోల్‌మాల్' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం పౌరసరఫరాల శాఖ డీఎం జగదీష్, డీసీఎస్‌ఓ సురేష్ రెడ్డి, డీపీఎం మోహన్, పాపన్నపేట తహసీల్దార్ సతీష్ కుమార్, కమిటీ సభ్యులు విచారణ జరిపారు. అనంతరం డీఎం జగదీశ్, తహసీల్దార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. లారీలో నింపిన ధాన్యం బస్తాల లెక్కల్లో పొరపాటు జరిగిందన్నారు. కమిటీ సభ్యులు ట్రక్ షీట్లో పొరపాటున 766 బస్తాలు ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. నిజానికి లారీలో వెళ్లింది 716 బస్తాలేనని చెప్పారు. ఈ లెక్కన నికర బరువు 301.30 కిలోలు వచ్చిందన్నారు. రైతు భూమయ్యకు సంబంధించి మొదట కమిటీ మెంబర్లు 347 బస్తాలుగా పేర్కొన్న విషయాన్ని నిర్ధారించారు. ఖాళీ గోనె సంచులతో కూడా ఈ లెక్కలు సరిపోయాయని చెప్పారు.

దశాల వారీగా రుణాలు



రికార్డులను పరిశీలిస్తున్న సీఈఓ ఎల్లయ్య

శివ్వంపేట(నర్సాపూర్): రాజీవ్ యువ వికాస్ పథకం కోసం దరఖాస్తు చేస్తున్న అర్హులందరికీ దశాలవారీగా రుణాలు మంజూరవుతాయని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 30వేలకు పైగా యువ వికాస్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించిన వారి పత్రాలను సరిచేసి సంబంధిత బ్యాంకులకు పంపించామని తెలిపారు. నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు వచ్చే నెల 2న రుణాల మంజూరు పత్రాలు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పిల్లల ఎత్తులను పరిశీలిస్తున్న హైమావతి

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో మంగళవారం జిల్లా వెల్ఫేర్ అధికారి హైమావతి అంగన్‌వాడీ నాల్గవ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల బరువులు, ఎత్తును పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాటీ టీచర్ లక్ష్మీనరసమ్మ, పిల్లల తల్లులు గర్భిణీలు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు పునఃప్రారంభం

తూప్రాన్: పోస్టాఫీసులో ఆధార్ సేవలు పునః ప్రారంభం అయినట్లు మెదక్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌ర్‌డెంట్ శ్రీహరి తెలిపారు. మంగళవారం తూప్రాన్‌లో ఆధార్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆధార్‌కార్డు నమోదు, మార్పులు, చేర్పులు, ఫొటో ఐడెంటిటీ, బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీతో పాటు సమీప గ్రామాల ప్రజలు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు ఖేడ్ గురుకులంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

నారాయణఖేడ్: ఖేడ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో 2025 –26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు. 2024 –25 విద్యా సంవత్సరంలో పదవతరగతి ఉత్తీర్ణత సాధించిన బాలురకు ఈనెల 15న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ హయత్‌నగర్‌లోని పీపీటీజీ బాలుర కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

బాబోయ్‌.. ప్లాస్టిక్ భూతం!

- అడ్డగోలుగా వినియోగం
- పొంచి ఉన్న పెను ప్రమాదం
- నిషేధం అమలయ్యేనా?
- ఆచరణలో కానరాని ఫలితం

ప్రజల్లో మార్పు రావాలి



ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. పాలిథీన్ కవర్లకు బదులు ఇతర సంచులు వాడాలి. తద్వారా ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుందని చెబుతున్నాం. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే వంద శాతం ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుంది.

–శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మెదక్

మెదక్ మున్సిపాలిటీ: ఉదయం నుంచి నిద్రించే వరకు ప్లాస్టిక్‌తో మానవ జీవితం ముడిపడి ఉంటోంది. అంతలా కలిసిపోయిన ప్లాస్టిక్ వల్ల పర్యావరణంతో పాటు మానవాళికి పెను ముప్పు పొంచి ఉంది. ఇది తెలిసినా ప్లాస్టిక్‌ను అడ్డగోలుగా వినియోగిస్తూనే ఉన్నాం. పర్యావరణ వేత్తలు, ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా.. కొద్దిగానైనా మార్పు రావడం లేదు. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా వీటి వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. పట్టణంలోని వీధుల్లో, రోడ్ల పక్కన, నివాస గృహాల సమీపంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న తక్కువ ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం ఉండేది. ప్రస్తుతం 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించాలంటే వ్యక్తిగతంగా, సమష్టిగా ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని.. అప్పుడే పర్యావరణ ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఓ హోటల్‌లో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

రోజుకు 3 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు

మెదక్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 20 వేల నివాస గృహాలు, దుకాణాలు ఉన్నాయి. 10 ఆటోలు, ఏడు ట్రాక్టర్లతో పట్టణంలో చెత్త సేకరణ చేస్తున్నారు. ప్రతిరోజు 18 టన్నుల చెత్త పోగవుతోంది. అందులో 3 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. అడపా దడపా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నారు. రూ.5000 నుంచి రూ.20వేల వరకు జరిమానా సైతం విధిస్తున్నారు. తదనంతరం అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తిరిగి వాటి విక్రయాలను కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏళ్ల తరబడి ప్రణాళిక రూపొందిస్తున్నా.. కౌన్సిల్లో తీర్మానాలు చేస్తున్నా.. అమలులో క్షేత్రస్థాయి లోపాలతో అడ్డుకట్ట పడటం లేదు.

ముమ్మరంగా తనిఖీలు

ప్రస్తుతం ప్లాస్టిక్ నిషేధానికి అధికారులు మళ్లీ నడుం బిగించారు. గడిచిన కొన్ని రోజులుగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన మెదక్‌లో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో దుకాణాలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నారు. కూరగాయల మార్కెట్‌తోపాటు హోల్‌సెల్, రిటేల్ దుకాణాలు, వైన్స్‌లు, పర్మిట్ రూంలలో, స్వీట్ హౌస్‌లు, హోటళ్లలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను వాడకుండా కఠినంగా చర్యలు చేపడుతున్నారు. ఆయా పార్టీల నుంచి రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా ఎక్కడా తగ్గకుండా దాడులు కొనసాగిస్తూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మెదక్ పట్టణంలోని ఆటోనగర్, వెల్‌కంబోర్డు ప్రాంతంలోని హోటళ్లు, స్వీట్‌హౌజ్‌లలో తనిఖీలు నిర్వహించగా హోటల్‌కు రూ.10వేల జరిమాన విధించారు.



ఎస్.కొండాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, చిత్రంలో తహసీల్దార్ మన్నన్, ఏపీఎం లక్ష్మీనారాయణ తదితరులు

చివరి గింజ వరకు కొంటాం

- రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించం
- కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్, గవ్వలపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంటా చేస్తున్న తీరు, ధాన్యం తేమ శాతం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో అవకతవకలు పాల్పడినా, ధాన్యం ఎక్కువ కాంటా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 1లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 71 రైస్‌మిల్లులకు ధాన్యం పంపించామని ఆయన వివరించారు. ధాన్యం నిల్వలకు అవసరమైతే ప్రభుత్వం గోదాంలను కేటాయిస్తుందని చెప్పారు. రైస్‌మిల్లుల వద్ద ఆన్‌లోడ్ కోసం రెవెన్యూ అధికారిని కేటాయించామని చెప్పారు. ధాన్యం రైస్‌మిల్లుకు చేరిన 48 గంటలలో రైతుల ఖాతాలలో డబ్బులు జయ చేస్తున్నామని చెప్పారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మన్నన్, ఐకేపీ ఏపీఎం లక్ష్మినారాయణ ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో వేగం పెంచండి

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో వేగం పెంచాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి తన చాంబర్ నుంచి జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి ఎద్దడి నివారణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసానికి సంబంధించి బీసీ, ఎస్సీ, మైనార్టీ, ట్రైబల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అధికారులతో వెరిఫికేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరలో అర్హత గల లబ్ధిదారులకు మంజూరు చేస్తామన్నారు. అలాగే జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట ప్రణాళిక ద్వారా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

పాలిసెట్‌కు 1,705 హాజరు



హాల్ టికెట్ నెంబర్ పరిశీలిస్తున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన పాలిసెట్ ప్రవేశ పరీక్షకు 1705 మంది విద్యార్థులు హాజరయ్యారు. మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సిద్ధార్థ్ మోడల్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఏ, బీ, ఆర్ట్ సెంటర్లు), బాలుర ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా, పరీక్షకు మొత్తం 1,776 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 1,705 మంది హాజరు కాగా మరో 71 మంది గైర్హాజరయ్యారు.

దివ్యాంగులకు ఏఐ పరికరాలపై పరిశోధనలు

ఐఐటీహెచ్, ఎంఎన్‌ఆర్ యూనివర్సిటీ ఒప్పందం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగించి పాక్షిక దివ్యాంగులకు ఉపయోగపడే పరికరాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా హైదరాబాద్ ఐఐటీ, ఎంఎన్‌ఆర్ వర్సిటీలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు రెండు విద్యా సంస్థలు మంగళవారం ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా ఎంఎన్‌ఆర్ వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ రవివర్మ మాట్లాడుతూ... అభివృద్ధి చేసిన పరికరాలను ఆస్పత్రుల్లో పరీక్షించి పాక్షిక దివ్యాంగులకు ఇచ్చేందుకు ఈ పరిశోధనలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ ప్రొఫెసర్ రేనుజాన్, బీఏబుల్ హెల్త్ సంస్థ సీఈఓ హబీబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న ఐఐటీహెచ్, ఎంఎన్‌ఆర్ యూనివర్సిటీ ప్రతినిధులు

డిగ్రీ దోస్త్ షురువైంది

- ఈ నెల 21 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం
- మూడు విడతల్లో అడ్మిషన్ల ప్రక్రియ
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 18,150 సీట్లు



జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

జహీరాబాద్ టౌన్: ఇంటర్ ఫలితాలు వచ్చాయి. డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. మూడు విడతలుగా సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ నెల 3 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి విడత రిజిస్ట్రేషన్లు ఈ నెల 21 వరకు కొనసాగుతాయి. జూన్ నెలాఖరు వరకు అడ్మిషన్లు పూర్తి చేసి 30 నుంచి మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయి.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లలో పారదర్శకతకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అందుబాటులోకి తెచ్చింది. దీనికి సంబంధించి 2025–26 విద్యా ఏడాదికి నోటిఫికేషన్ ఉన్న విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ప్రకటించారు. మూడు విడతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఈ నెల 21 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈనెల 10 నుంచి 20 వరకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలి. 28తో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కాగా 29న సీట్ల కేటాయింపు ఉంటుంది. 30 నుంచి జూలై 6వ తేదీ వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. రెండవ విడతలో మే 30 నుంచి జూన్ 8 వరకు రిజిస్ట్రేషన్, జూన్ 13న సీట్ల కేటాయింపు, 18 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. మూడవ విడతలో జూన్ 13 నుంచి 19 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. జూన్ 23న సీట్ల కేటాయింపు, 28 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా సీట్లు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్,సాంఘిక, గిరిజన సంక్షేమ కళాశాలల్లో 18,150 సీట్లు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో 8,150, మెదక్ జిల్లాలో 4,800, సిద్దిపేట జిల్లాలో 7,400 సీట్లున్నాయి. డిగ్రీ కోర్సులను అవగాహనతో ఎంచుకోవాలి. డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారికి సైతం సత్వర ఉద్యోగ అవకాశాలున్నాయి. కంప్యూటర్ సైన్స్‌కు మంచి అవకాశాలు ఉన్నాయి, బీకాంలో కంప్యూటర్ సైన్స్ తీసుకుంటే కంప్యూటర్ ఆపరేటర్లు,అకౌంటెంట్లుగా చేసుకునేందుకు వీలు ఉంటుంది. బీఎస్సీ పూర్తి చేసిన వారికి ఫార్మా కంపెనీలో కెరీర్ ఉంటుంది. మ్యాథ్స్ సబ్జెక్టుకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. డిగ్రీ చదివిన వారు ఎంబీఏ, ఎంసీఏ కూడా చేయవచ్చు. ఆర్ట్స్ కోర్సులు చేసే వారి సంఖ్య రోజు రోజుకు తగ్గుతోంది. డిగ్రీ, పీజీ కోర్సులు చేసినా ఉపాధి అవకాశాలు ఉండటంలేదని ఇంటర్ నుంచే ఆర్ట్స్ గ్రూపులో చేరడం లేదు. ప్రైవేట్ కళాశాలలో దాదాపు ఈ గ్రూపు ఉండటం లేదు.

బెనిఫిట్స్ అందక బేజారు

- ఏళ్ల తరబడి లేబర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- రెండేళ్లుగా ఇన్‌చార్జి అధికారులే దిక్కు
- ఆందోళన చెందుతున్న బాధితులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు కొలుపుల పద్మ. మెదక్ మండలం మక్తభూపతీపూర్ గ్రామం. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకు ఆమెది. పద్మ లేబర్ కార్మికురాలిగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆమె కూతురు పెళ్లి జరిగి.. ఇద్దరు పిల్లలు పుట్టినా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రసవం కోసం అందాల్సిన రూ.30 వేలు అందటం లేదు. నిత్యం కార్మికశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. ఇలా పద్మలాంటి మరో పది మంది బాధితులు మంగళవారం లేబర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.



అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని వేడుకుంటున్న బాధితులు

మెదక్‌జోన్: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవటంతో ఎక్కువ శాతం మంది వర్షాకాలంలో వ్యవసాయ కూలీలుగా, తర్వాత భవన నిర్మాణ కార్మికులుగా, లేదా అడ్డామీద కూలీలుగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ కార్మికులకు కేంద్రం నుంచి అనేక రాయితీలు, ప్రయోజనాలు కల్గించే పథకాలు ఉన్నాయి. కానీ.. అవగాహన లోపంతో పలురకాల ప్రయోజనాలను వీరు పొందలేకపోతున్నారు. ఈ క్రమంలోనే కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కార్డు కలిగిన అర్హులకు అందాల్సిన బెనిఫిట్స్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అందని ద్రాక్షగా మిగిలింది.

కార్మికుల బెనిఫిట్స్ ఇలా..

- భవన నిర్మాణంతో పాటు ఇతర రంగాల్లో పని చేసే కార్మికుల జీవితం ఎప్పుడు ప్రమాదం అంచునే ఉంటుంది. ఇలాంటి వారి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలతో కార్మికులకు ఈ విధంగా లబ్ధి చేకూరనుంది.
- కార్మికుడిగా పనులు చేస్తూ ఆ శాఖలో రూ.110 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆ కార్మికుడు, లేదా కార్మికురాలు సాధారణ మరణం చెందితే రూ.1.30 లక్షలు, అదే ప్రమాదావశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సాయం అందుతుంది.
- కార్మిక కుటుంబాల్లోని యువతులకు పెళ్లిళ్లు, లేదా ప్రసవాలు జరిగినా రూ.30 వేల ఆర్థిక సాయం అందిస్తారు.

రెండేళ్లుగా ఇన్‌చార్జిలే..

మెదక్ జిల్లాలో లేబర్ ఆఫీసు ఉన్నప్పటికీ రెండేళ్లుగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. వారు నెలకోసారి కూడా ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నెట్టుకొస్తున్నాడు. నిబంధనల ప్రకారం కార్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ ఏళ్ల తరబడి అందటంలేదు. కార్మికుల కూతుళ్లకు ప్రసవం డబ్బులు రాక కొందరు. భర్త చనిపోయిన వారికి రావాల్సిన లబ్ధి కోసం మరికొందరు, ప్రమాదంలో మృతి చెందిన కుటుంబీకులు.. ఇలా పది మంది బాధితులు మంగళవారం లేబర్ కార్యాలయానికి వచ్చారు. ఏళ్ల తరబడి తమను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని, బెనిఫిట్స్ కోసం డాక్యుమెంట్స్‌ను అందించినా ఏదో కుంటిసాకుతో కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యం మాట వాస్తవమే

సాంకేతిక కారణాల వల్ల కొన్ని రోజులపాటు ఆలస్యమైన వాస్తవమే. దీంతో కొంత మందికి అందించాల్సిన బెనిఫిట్స్ అందించడంలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం తాను వికారాబాద్‌కు బదిలీ అయ్యాను. మెదక్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– యాదయ్య, ఇన్‌చార్జి లేబర్ అధికారి

క్లుప్తంగా

సీఎంఆర్ ధాన్యంలో అవకతవకలు

- రూ.4.57 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి
- ముగ్గురు నిందితులు అరెస్టు

కొమురవెల్లి(సిద్దిపేట): రైస్ మిల్లులో ప్రభుత్వ ధాన్యం అవకతవకలు జరిగిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. మండలంలోని కిష్టంపేట శివారులో ఉన్న శ్రీనివాస రైస్‌మిల్‌లో సివిల్ సప్లయ్ మేనేజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం సీఎంఆర్‌కు అప్పగించిన ధాన్యం మిల్లింగ్‌లో మొత్తం 18,513 క్వింటాళ్ల ధాన్యం అవకతవకలకు గురైందని, దాని విలువ రూ.4,57,93,542 ఉంటుందని పోలీస్ స్టేషన్‌లో సివిల్ సప్లయ్ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి మిల్లు యజమానులైన ఆకుల ప్రతాప్, ఆకుల కృష్ణ, ఆకుల శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న బైక్ : వ్యక్తి మృతి


కిష్టయ్య మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మహమ్మద్‌నగర్ శివారులోని హనుమాన్‌గుడి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. రాయిలాపూర్ గ్రామానికి చెందిన కుర్మ కిష్టయ్య(51) భార్య పద్మతో కలిసి బైక్‌పై వెల్దుర్తి మండలం దర్పల్లి గ్రామంలో బంధువుల వద్దకు సోమవారం వెళ్లాడు. మంగళవారం ఒక్కడే తిరిగి వస్తున్నాడు. మహమ్మద్‌నగర్ శివారులోని హనుమాన్ ఆలయం సమీపంలోని అడవిలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌తోపాటు అతను పొదల్లో పడిపోయాడు. చాలా సేపటికి పెట్రోలింగ్ పోలీసులు చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి దత్తత కుమారుడు గౌరకంటి షాదుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో ఉరేసుకొని ఇద్దరు ఆత్మహత్య

వేలూరు గ్రామంలో వ్యక్తి


మహేశ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వర్గల్ మండలం వేలూరులో మంగళవారం చోటు చేసుకుంది. గౌరారం ప్రొబేషనరీ ఎస్‌ఐ కీర్తి రాజు కథనం మేరకు.. వేలూరుకు చెందిన చింతకింది మహేశ్(36), అనూష దంపతులకు కూతురు వైష్ణవి ఉంది. నాలుగేళ్ల కిందట మహేశ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటికే పరిమితమయ్యాడు. భార్య అనూష కూలీగా పని చేస్తుంది. 14 నెలల కిందట నుంచి గ్రామంలో ఇల్లు కట్టుకుంటున్నారు. తెలిసిన వారి దగ్గర అప్పు చేసినప్పటికీ ఇంటి నిర్మాణం పూర్తికాలేదు. దీంతో మనస్తాపం చెందిన మహేశ్ మంగళవారం ఉదయం భార్య కూలీ పనికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

జహీరాబాద్‌లో నగల వ్యాపారి


రవికాంత్ (ఫైల్)

జహీరాబాద్: అప్పుల బాధతో నగల వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జహీరాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ పట్టణంలోని మహీంద్ర కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న రవికాంత్(34) బంగారం నగల వ్యాపారం చేసుకుంటున్నాడు. అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి పెరగడంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు పేర్కొన్నాడు.


తోటపల్లిలో ఆయిల్ పామ్‌లో అంతర పంటగా మొక్కజొన్న సాగు చేసిన రైతు

శ్రమ నాలుగేళ్లు.. దిగుబడి 30 ఏళ్లు

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు ప్రోత్సాహం

- సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందజేత
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- వినియోగించుకోవాలంటూ సూచనలు

రైతులు వరి, మామిడి, తదితర పంటను సాగు చేసి అధిక దిగుబడుల కోసం విచ్చలవిడిగా రసాయన ఎరువులను పిచికారీ చేసి పెట్టుబడుల భారం పెంచుకుంటున్నారు. చివరికి వడగళ్లు, అకాల వర్షాలకు పంట నేలపాలై ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. ఈ క్రమంలో రైతులు ఎక్కువగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహిస్తుంది. ఇటీవల గ్రామాల వారీగా ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ, లీవింగ్‌పామ్ కంపెనీ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ ఆయిల్‌పామ్ సాగు ద్వారా వచ్చే దిగుబడి, ఆదాయాలపై వివరిస్తున్నారు.

పెద్దశంకరంపేట(మెదక్) /హుస్నాబాద్‌రూరల్:

మెదక్ జిల్లాలో 5 వేల ఎకరాలు లక్ష్యం

జిల్లాలో 5 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు దాదాపు 1,000 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. వివిధ మండలాల్లో మరికొంత మంది రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. దశాబ్దాలుగా వరి సాగు చేస్తున్న పలువురు రైతులు పంట మార్పిడి చేయాలని భావించి ఆయిల్ పామ్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 20 మండలాల పరిధిలో దాదాపు 1,000 ఎకరాల వరకు ఆయిల్ పామ్ పంటను సాగు చేశారు. ఇటీవలె పెద్దశంకరంపేట, అల్లాదుర్గం మండలాల్లో రైతులతో అధికారులు ఒప్పందం చేసుకున్నారు.

వరి పంటను తగ్గించి..

హుస్నాబాద్ డివిజన్‌లో అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, హుస్నాబాద్ మండలాల్లో 1,700 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. యాసంగి పంటలకు సాగు నీటి కొరతను అధిగమించడానికి వరి పంటను తగ్గించి ఆయిల్ పామ్ సాగు చేస్తే లాభాలు పొందవచ్చు. డివిజన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 1,000 ఎకరాలు, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో 1,500 ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతులు పంట దిగుబడులు రాగానే నంగునూర్ మండలంలోని ఆయిల్ పామ్ కంపెనీ వారే రైతుల వద్దకు వచ్చి పంటను కొనుగోలు చేయనున్నారు.

సబ్సిడీపై మొక్కలు, డ్రిప్పు పరికరాలు

ఆయిల్ పామ్ సాగు చేసే ఎస్సీ, ఎస్టీలకు డ్రిప్ సిస్టం కోసం 100 శాతం సబ్సిడీ ఇస్తుంది. బీసీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. మొక్కలకు సబ్సిడీ అందించడంతోపాటు బిందు సేద్యం ద్వారా నీరు అందించడానికి డ్రిప్పు పరికరాలనూ సబ్సిడీపై అందించనుంది. ఆయిల్ పామ్ మొక్కలను 90 శాతం సబ్సిడీ పై రూ.1,140కి రైతు వాటా చెల్లిస్తే ఎకరాకు 57 మొక్కలను ప్రభుత్వం అందిస్తుంది. నాలుగేళ్ల పంటల నిర్వహణ కోసం ఎకరాకు రూ.4,200 ప్రభుత్వం రైతుకు ఇస్తుంది. పెద్ద రైతులు వరి పంటలను తగ్గించి ఆయిల్ పామ్ సాగు చేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం

హుస్నాబాద్ డివిజన్‌లోని పెద్ద రైతులు ఎక్కువ వరి సాగు తగ్గించి దీర్ఘకాలిక పంటైన ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి. నాలుగేళ్ల పంట సాగుకు శ్రమిస్తే 30 ఏళ్లపాటు ప్రతీ ఏటా ఎకరాకు 10 నుంచి 12 టన్నుల దిగుబడులు తీయొచ్చు. ఒక టన్నుకు రూ.20,000 అయినా ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం రైతుకు వస్తుంది. జూలై మొదలు జనవరి వరకు పంట దిగుబడులను తీయొచ్చని హుస్నాబాద్ ఏడీఏ శ్రీనివాస్ చెప్పుకొచ్చారు.


గొట్టిముక్కులలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాలుగేళ్లు అంతర పంటల సాగు

ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు పంట చేతికొచ్చే నాలుగేళ్ల సమయంలో అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చు. మొక్కజొన్న, పత్తి, పెసర్లు, మినుములు, బొబ్బెర, వేరుశనగ, పొద్దు తిరుగుడు, మునగ మొదలగు పంటలను రైతులు సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆరుతడి పంటలు సాగు చేయడం వల్ల సాగు నీటి కొరతను రైతులు అధిగమించి పంట దిగుబడులు తీయొచ్చు. ఆదాయం పొందవచ్చు.

రైతులకు అదనపు ఆదాయం



రైతులు తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా అధిక ఆదాయాన్ని పొందాలంటే ఆయిల్ పామ్ సాగు అనేది మంచి నిర్ణయం. రైతులు వరి, మొక్క జొన్న, పత్తి పంటల్లో స్వల్పకాలికంగా ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ దీర్ఘకాలికంగా రైతు ఆదాయం పెరగాలంటే తప్పనిసరిగా ఆయిల్ పామ్ సాగు చేయాలి. ప్రభుత్వం డ్రిప్ కు మరియు మొక్కలకు అధిక మొత్తంలో రాయితీలను ఇవ్వడం వలన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టేందుకు అవకాశం ఉంది.

– సంతోష్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

మొక్క రూ.20కే అందిస్తున్నాం



జిల్లాలో ఆయిల్ పామ్ తోటల సాగుకు అనుకూల వాతావరణం ఉంది. ఒక ఎకరాకు 57 మొక్కలు అవసరం ఉంటుంది. ఒక మొక్క పూర్తి ఖర్చు రూ.193 కానీ సబ్సిడీపై రైతులకు కేవలం ఒక మొక్కను రూ.20 అందిస్తున్నాం. అంతేగాక పంట సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తాం. ఆయిల్ పామ్ సాగు చేసిన నాలుగేళ్ల తర్వాత నుంచి దిగుబడి వస్తుంది. అప్పటి వరకు అంతర పంట సాగు కోసం ఏడాదికి రూ.4,200 అందజేయడం జరుగుతుంది.

– జాన్సన్, లీవింగ్ పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్

భూములను రీ సర్వే చేయండి


అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

దుబ్బాక: మండంలోని హబ్సిపూర్ గ్రామంలో గల సర్వే నంబర్ 417, 418లో వేణుగోపాల స్వామి ఆలయం పరిధిలో ఉన్న భూములు కొందరు కబ్జా చేశారని గ్రామస్తులు ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు చేయగా మంగళవారం సర్వే చేశారు. జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎండోమెంట్ భూములు కబ్జాకు గురైతున్నాయని గ్రామస్తులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు భూములను సర్వే చేస్తున్నామన్నారు. భూమూలు కబ్జా చేస్తే చర్యలు తప్పవన్నారు. అధికారులు గతంలో సర్వే చేసిన మాదిరిగానే మళ్లీ సర్వే చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములను రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో సర్వే చేసి కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

మృతురాలు పుల్‌కల్ మండల వాసి

చేగుంట(తూప్రాన్): ఇటీవల మండల శివారులో కాలిపోయి గుర్తు పట్టకుండా ఉన్న మహిళ మృతదేహం పుల్‌కల్ మండలానికి చెందిన మహిళదిగా పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. 7న చేగుంట శివారులోని జాతీయ రహదారి పక్కన కాలిపోయి గుర్తు పట్టకుండా ఉన్న మృతదేహం గుర్తించి కేసు నమోదు చేశాం. మృతురాలి ఆచూకీ కోసం విచారణ చేపట్టగా సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ పోలీస్ స్టేషన్‌లో బస్వాపూర్ గ్రామంలో మహిళ అదృశ్యంపై కేసు నమోదైనట్లుగా తెలిసింది. ఈ కేసు ఆధారంగా వివరాలు సేకరించి బస్వాపూర్ గ్రామానికి చెందిన జయమ్మగా గుర్తించాం. మహిళది హత్యగా భావించిన పుల్కల్ పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారని ఎస్‌ఐ తెలిపారు.

రాంగ్‌రూట్లో వచ్చి.. బైక్‌ను ఢీకొట్టి

- కౌడిపల్లి మండలంలో కారు బీభత్సం
- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు


గాయాలతో రమేశ్


ఊరట్ల లక్ష్మణ్

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలంలో కారు బీభత్సం సృష్టించింది. రాంగ్‌రూట్లో వచ్చిన కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట సమీపంలోని సిరి వెంచర్ వద్ద 765డి జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని రాజిపేట గ్రామానికి చెందిన ఊరట్ల లక్ష్మణ్, అతడి స్నేహితుడు తోల్ల రమేశ్ ఇద్దరూ పెట్రోల్ పంపులో పనులు చేస్తారు. సొంత పని నిమిత్తం బైక్‌పై నర్సాపూర్ వెళ్తున్నారు. వెంకట్రావ్‌పేట సమీపంలోనికి రాగానే ఎదురుగా కొల్చారం గ్రామానికి చెందిన వేణు మాదవ్ కారును అజాగ్రత్తగా నడుపుతూ రాంగ్ రూట్లో వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మణ్, రమేశ్ ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులను 108లో ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్ మేనమామ ఊరట్ల వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రమాద దృశ్యాన్ని వెనుక నుంచి వస్తున్న వేరే కారులోని వ్యక్తులు సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.


కౌడిపల్లి(నర్సాపూర్): ప్రమాదానికి సంబంధించిన వీడియో

లారీ ఢీకొని యువతికి గాయాలు

చేగుంట(తూప్రాన్): లారీ ఢీకొని యువతికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన చేగుంట గాంధీ చౌరస్తా వద్ద మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. చిన్న శంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన నేరెళ్ల శిరీష అమ్మమ్మ ఇంటికెళ్లేందుకు చేగుంటలో బస్సు దిగింది. అక్కడి నుంచి రామేశంపల్లెకు వెళ్లడానికి రామాయంపేట బస్సు కోసం నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలైన శిరీషను 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మైలి శ్రీను ఎక్కడ?

- హత్య చేసి ఉంటారని పోలీసుల అనుమానం
- భార్యతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన మైలి శ్రీను అదృశ్యంపై పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 16వ తేదీ నుంచి శ్రీను కనిపించడం లేదని భార్య లత అదే నెల 28న హవేళిఘణాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు శ్రీనుని హత్య చేసి ఉంటారని, అతడి అతడి భార్యతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. శ్రీను భార్య లతకి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయంలో గొడవలు పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వంటిమామిడి వద్ద పోలీస్‌ల స్పెషల్ డ్రైవ్


ట్రాఫిక్ రద్దీ నివారణ చర్యలపై చర్చిస్తున్న సీఐ మహేందర్, ఎస్‌ఐలు

వాహనాల రద్దీ నియంత్రణకు చర్యలు

ములుగు(గజ్వేల్): నిత్యం వాహనాల రద్దీతో రాకపోకలకు ఆటంకంగా మారిన రాజీవ్ రహదారిపై గల వంటిమామిడి మార్కెట్ యార్డు వద్ద మంగళవారం ములుగు పోలీస్‌లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హైదరాబాద్–కరీంనగర్ వెళ్లే రాజీవ్ రహదారిపై వంటిమామిడి మార్కెట్ యార్డు ఉంటుంది. ప్రతీ నిత్యం తెల్లవారు జాము 4 గంటలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూరగాయల విక్రేతలు, వ్యాపారుల వాహనాలతో సందడిగా ఉంటుంది. దీంతో ఈ రోడ్డుపై కరీంనగర్, సిద్దిపేట వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర ఆటంకంగా మారింది. రాజీవ్ రహదారిపై క్రయవిక్రయాల రద్దీని అధిగమించేందుకు యార్డు ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశంలో మార్కెట్ నిర్మాణం చేపడుతామని ఇటీవలె ఇక్కడి పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. తాజాగా గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ డైరెక్టర్ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. రోడ్డుపైన రాకపోకలకు అవరోధంగా నిలిచిన కూరగాయల వాహనాలను మార్కెట్‌యార్డు లోపలికి పంపించారు. దీంతో అక్కడ ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. వంటిమామిడి మార్కెట్ యార్డు ఎదుట మార్కెట్ యార్డు నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ ములుగు తహసీల్దార్ ఆరీపాతో కలసి మంగళవారం పరిశీలించారు.

గుర్తు తెలియని మహిళ దారుణ హత్య

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల గ్రామ శివారులో సోమవారం రాత్రి గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామ శివారులో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా తల, ముఖం, చేతులు, ఛాతి కమిలిపోయినట్లు గుర్తించాం. అంగ వైకల్యంతో మృతురాలి రెండు కాళ్ల పాదాలు వంకరగా ఉన్నాయి. కుడి చేతిపై రజిత, ఎడమ చేతిపై మహేశ్ అనే పేర్లు పచ్చబొట్టు వేయించుకుంది. మెదక్‌తోపాటు కామారెడ్డి జిల్లాలో ఆచూకీ కోసం ఆయా పోలీస్ స్టేషన్లకు సమాచారం పంపించాం. కనీసం ముగ్గురు వ్యక్తులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఘటనా స్థలిని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. త్వరలో మృతురాలి ఆచూకీ కనిపెట్టి నిందితులను అరెస్ట్ చేస్తామని తెలిపారు. అలాగే, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, స్థానిక సీఐ వెంకట్‌రాజాగౌడ్, ఎస్‌ఐ బాల్‌రాజ్ ఘటన వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

దుబ్బాక దవాఖాన రాష్ట్రంలోనే టాప్

ఓపీ సేవల్లో మొదటి స్థానంలో నిలిచిన ఏరియా ఆస్పత్రి

- ఈహెచ్‌ఎంఐఎస్ జాబితా విడుదల
- ర్యాంకు ఇచ్చిన వైద్యారోగ్య శాఖ
- ఇటీవలె ఆస్పత్రిని సందర్శించిన రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్


ఆస్పత్రిని సందర్శించి రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

దుబ్బాక: రాష్ట్రంలోనే ఉత్తమ వైద్య సేవలు అందించడంలో దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆదర్శంగా నిలిచింది. తాజాగా తెలంగాణ (ఈహెచ్‌ఎంఐఎస్) వైద్య ఆరోగ్య, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ విడుదల చేసిన జాబితాలో ఉత్తమ ఓపీ వైద్య సేవల్లో దుబ్బాక ఆస్పత్రి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏరియా, జిల్లా ఆస్పత్రులు, సీహెచ్‌సీలతోపాటు ఉస్మానియా ఆస్పత్రితోపాటు పెద్దాస్పత్రులను మొత్తం 102 ఆస్పత్రులను పరిగణలోకి తీసుకొని ఈ జాబితాను వైద్య, ఆరోగ్యశాఖ విడుదల చేసింది. జనవరి 1న 2025 నుంచి మే8 వరకు గణాంకాలను పరిగణలోకి తీసుకొని రూపొందించారు.

అబా యాప్‌లో రోగుల ఆరోగ్య రికార్డులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అబా యాప్ (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ ఖాతా) ద్వారా దుబ్బాక ఆస్పత్రికి వచ్చే రోగుల రికార్డులను పొందుపరుస్తున్నారు. ఆస్పత్రికి వైద్య సేవల కోసం వచ్చే రోగులకు వారి మొబైల్‌లో అబా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి రోగి ఆరోగ్య వివరాలు పొందు పరుస్తున్నారు. రోగి ఏ ఆస్పత్రికి వెళ్లినా ఈ అబా యాప్‌ను చూపిస్తే వారి ఆరోగ్య పరిస్థితి అంతా తెలిసిపోతుంది. ఇందు కోసం ఆస్పత్రిలో 7 మాడ్యూళ్లను సజావుగా నడుపుతున్నారు. జనవరి 1, 2025 నుంచి మే 8, 2025 వరకు ఓపీడీ 25,593, ఈఓపీ 15,000 రోగులు కలిపి మొత్తం 40,593 మంది రోగులు దుబ్బాక ఆస్పత్రికి వైద్య సేవల కోసం వచ్చినట్లు తెలిపారు. ప్రతి రోజూ ఆస్పత్రిలో 300 ఓపీ ఐతే అబా 150 టోకెన్లు, డాక్టర్ ప్రిస్కిప్షన్ 200 నుంచి 250 అవుతుంది. డాక్టర్ ప్రిస్కిప్షన్ 90 శాతం, అబా 80 శాతంతో రాష్ట్రంలో ఓపీ వైద్యసేవల్లో టాప్‌లో నిలిచింది. గతేడాది రెండో స్థానంలో నిలువగా ఈసారి మొదటి స్థానంలో నిలవడం విశేషం.



దుబ్బాక ప్రభుత్వాస్పత్రి

ఇటీవలె సందర్శించిన కమిషనర్

మే 3న దుబ్బాక ఆస్పత్రిని రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సందర్శించి ఆస్పత్రి నిర్వహణ, రోగులకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా ప్రశంసించారు. సరైన వైద్య సిబ్బంది లేకున్నా కార్పొరేట్‌కు దీటుగా సేవలు అందిస్తూ రాష్ట్రంలో ఉత్తమ ఆస్పత్రిగా నిలవడం అభినందనీయం అన్నారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితోపాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీనిచ్చారు. కమిషనర్ వచ్చిన ఐదు రోజులకే ఓపీ వైద్య సేవల్లో టాప్ స్థానంలో నిలువడం విశేషం.

వైద్య సిబ్బంది సహకారంతోనే..



ఓపీ వైద్య సేవల్లో దుబ్బాక ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలువడం చాలా సంతోషంగా ఉంది. వైద్యులు, సిబ్బంది నిరంతర సహకారంతోనే ఈ ఘనత సాధించాం. ఇంకా మంచి వైద్య సేవలు అందించి ఉత్తమ స్థానంలో నిలుస్తాం. ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన తమ వైద్య బృందానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

– డాక్టర్ హేమరాజ్‌సింగ్, దుబ్బాక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

మొదటి స్థానం సంతోషకరం



ఉత్తమ వైద్య సేవల్లో దుబ్బాక ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలువడం సంతోషకరం. ఇప్పటికే అరుదైన సర్జరీలు, వైద్య సేవలు అందించడంలో రాష్ట్రంలోనే మంచి పేరు సాధించింది. సరిపడా వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలు లేనప్పటికీ ఉన్న సిబ్బందితో నిరంతరం కష్టపడి ఈ ఘనత సాధించడం విశేషం.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

వరకట్న వేధింపుల కేసులో నలుగురు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: వరకట్న వేధింపుల కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ ఉపేందర్‌తో కలిసి ఏసీపీ మధు కేసు వివరాలను మంగళవారం వెల్లడించారు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెన్న పవన్ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పొచన్నపేట గ్రామానికి చెందిన దంతూరి పుష్ప, భిక్షపతిల కూతురు అక్షయ (25)ను 2019లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. 2020లో ఇరు కుటుంబ సభ్యులు రూ.5 లక్షల కట్నంతో పాటు నాలుగు తులాల బంగారం పెట్టి మళ్లీ వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమారులు. పవన్ కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్నాడు. అప్పటినుంచి అదనపు కట్నం కోసం అక్షయను భర్త పవన్, అతడి కుటంబ సభ్యులు వేధిస్తుండటంతో భరించలేక 10న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం అక్షయ భర్త పవన్‌తోపాటు మామ సత్తయ్య, అత్త కనకవ్వ, మరిది కల్యాణ్‌ను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.